

ఆంజనేయులు (ఫైల్)

## భూమి తక్కువ ఇచ్చారని రైతు ఆత్మహత్య

- అన్నదమ్ముల భూమి పంచాయితీతో మనస్తాపం
- ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని బలవన్మరణం
- నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరులో విషాదం

కోడేరు, ఆగస్టు 30: భూమిలో తనకు రావాల్సిన వాటాను తన్నదమ్ములు తక్కువగా ఇచ్చారన్న మనస్తాపంతో రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలం రాజాపూర్‌లో చోటుచేసుకుంది. రాజాపూర్‌కు చెందిన రేకులపాడు బాలస్వామికి ముగ్గురు కుమారులు. బాలస్వామికి సుమారు 9 ఎకరాల భూమి ఉంది. బాలస్వామి మరణానంతరం మూడేండ్ల కిందట రేకులపాడు ఆంజనేయులుకు కేవలం 1.30 ఎకరాలు మాత్రమే ఇచ్చి.. మిగతా భూమి (సుమారు ఏడెకరాలు)ని ఇద్దరు అన్నదమ్ములు పంచుకున్నారు. తనకు సమాన భాగాలు కాకుండా తక్కువ భూమి ఇచ్చారంటూ అన్నదమ్ముల పంచాయితీ పెద్ద మనుషుల సమక్షంలో నడుస్తున్నది. అయినా.. ఎటూ తేలకపోవడంతో ఆంజనేయులు (40) మనస్తాపానికి గురయ్యాడు. గురువారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య అరుణ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్సై ఖయ్యూం తెలిపారు.

# ఎండుతున్న పంటలు

## వానకాలంలోనూ తిరుమలగిరి మండలంలో కరువు ఛాయలు

- ఎస్సారెస్పీ నుంచి కాల్వలకు అందని నీళ్లు
- అడుగంటిన భూగర్భ జలాలు.. ఆగిపోస్తు బోర్లు
- ప్రభుత్వం ఆదుకోవాలని రైతన్నల వేడుకోలు

తిరుమలగిరి, ఆగస్టు 30: ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ఒకనాటి కరువు ప్రాంతం తిరుమలగిరి.. బీఆర్‌ఎస్ పాలనలో కాళేశ్వరం జలాలతో జవసత్వాలు నింపుకొని సస్యశ్యామలైంది. నీటి చెమ్మ లేనిచోట పరవళ్లు తొక్కిన గోదావరి జలాలు అన్నదాత ఇంట సిరుల పంట పండించాయి. కానీ ఆ సంతోషం రైతాంగంలో ఎన్నో ఏండ్లు నిలువలేదు. కాంగ్రెస్ పాలన మళ్లీ పాతకాలాన్ని గుర్తుచేస్తూ కరువు కోరల్లోకి నెడుతున్నది. రేవంత్‌రెడ్డి సర్కారులో గోదావరి జలాల జాడలేక వానకాలంలోనూ వరి పైర్లు ఎండిపోతున్నాయి. వర్షాకాలం ప్రారంభమై రెండు నెలలు గడిచినా ఇప్పటివరకు ఒక్క భారీ వర్షం పడలేదు. ఎస్సారెస్పీ కాల్వల ద్వారా ప్రభుత్వం చెరువులు, కుంటలను నింపకపోవడంతో నీళ్లులేక వెలవెలబోతున్నాయి. వాగులు, వంకలు వట్టిపోయాయి. బిక్కేరు వాగులోనూ నీరు కనిపించడం లేదు. బోర్లు, బావుల ఆధారంగా కొద్దోగొప్పో వేసిన వరి పైర్లు ఎండిపోతున్నాయి. సాగు సిద్ధంగా వేసిన నారుమడుల్లో నారు ముదిరిపోతున్నది. గతంలో 30 ఫీట్ల లోతులో ఉన్న భూగర్భజలాలు ప్రస్తుతం



వెలిశాల 69 డీబీఎం పరిధిలో ఎస్సారెస్పీ కాల్వ పరిస్థితి

200 ఫీట్లకు అడుగంటాయి. గోదావరి జలాలు వస్తే 165 గ్రామాలకు నీరు అందించే 69, 70, 71 డీబీఎంల పరిధిలో వరి పైర్లు ఎండిపోతున్నాయి. ప్రస్తుత పరిస్థితులను చూసి రైతులు ఆందోళన చెందుతున్నారు. బీఆర్‌ఎస్ హయాంలో తిరుమలగిరి మండలంలో ఆగస్టు నెలాఖరు వరకు 20 వేల ఎకరాలకు పైగా వరి సాగయ్యేది. ప్రస్తుతం 10 వేల ఎకరాలు కూడా మించలేదు. మూడు వారాల నుంచి వర్షాల్లేకపోవడం, ఎండలు దంచి కొడుతుండడంతో పత్తి, కంది, వేరుశనగ పంటలు వాడిపోతున్నాయి. పత్తి పూత దశకు వచ్చే సమయంలో కాలం కలిసిరాకపోవడం రైతులను ఆందోళనకు గురిచేస్తున్నది. ఇంకో వారం రోజులు వర్షాలు పడకుండా, ఎండలు ఇలా కొడితే పత్తి పూత, గూడ రాలి రైతులు నష్టపోయే ప్రమాదం ఉంది.

### కానరాని కాళేశ్వరం జలాలు

తుంగతుర్తి నియోజకవర్గానికి ఎస్సారెస్పీ రెండో దశ కాల్వల ద్వారా సాగునీరు అందాల్సి ఉండగా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2024 యాసంగిలో సాగునీటి కష్టాలు మొదలయ్యాయి. ప్రస్తుత వర్షాకాలంలోనూ సాగునీటి విడుదలలో స్పష్టత లేకుండా పోయింది. కరీంనగర్ జిల్లాలోని లోయర్ మానేరు డ్యామ్ ద్వారా నీటి విడుదల ఆలస్యం జరుగుతుండడంతో కొడకండ్ల మండల కేంద్రంలోని బయన్న వాగు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లోకి నీళ్లు చేరతాయా, లేదా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### కేసీఆర్ టైమ్‌లో ధోకాలేదు



కేసీఆర్ టైమ్‌లో మాకు నీళ్లకు ధోకా లేకుండే. కాల్వ నీళ్లతోని చెరువులు, కుంటలు నింపడంతో బోర్లు పుష్కలంగా పోశాయి. వర్షాలతో సంబంధం లేకుండా వ్యవసాయం చేసుకునేవాళ్లం. ఇప్పుడు నీళ్లు లేక సాగు చేయాలంటేనే భయమైతున్నది.

–రైతు బాలూనాయక్, మొండిచింత తండా, తిరుమలగిరి మండలం

### వేసిన పంట.. పోసిన నారు ఎండుతుంది



రెండెకరాలు వరి నాటుపెట్టిన. నీళ్లు ఇస్తే మరో 2 ఎకరాల వరకు సాగు చేద్దామని నారు పోసిన. వేసిన పంట, పోసిన నారు ఎం డుతున్నది. ఎస్సారెస్పీ కాల్వల్లో నీరు వస్తే భూగర్భ జలాలు పెరిగి బోర్లు నిండుగా నీరు పోస్తయి. బోర్లు ఆగి పోస్తున్నయ్.

–రైతు బోయిని కొమరమల్లు, తిరుమలగిరి

# సర్కారు అనాలోచిత నిర్ణయంతో రైతులకు నష్టం

- అన్నదాతలు కేసీఆర్‌ను గుర్తుచేసుకుంటారనే.. కాళేశ్వరం మోటర్లను ఆన్ చేయడం లేదు
- మీడియాతో మాజీ ఎంపీ వినోద్‌కుమార్ ఆగ్రహం

మానకొండూర్, ఆగస్టు 30: కాంగ్రెస్ సర్కారు అనాలోచిత నిర్ణయంతో రైతాంగానికి తీవ్ర నష్టం వాటిల్లుతున్నదని, కేసీఆర్ గుర్తుకొస్తారనే అక్కసుతోనే కాళేశ్వరం మోటర్లను ఆన్ చేయడం లేదని మాజీ ఎంపీ వినోద్‌కుమార్ మండిపడ్డారు. శుక్రవారం కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండల కేంద్రంలోని గడిమహల్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. కేసీఆర్ కాళేశ్వరం




కరీంనగర్ జిల్లా మానకొండూర్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్

ప్రాజెక్టు నిర్మించి రైతుల సాగునీటి కష్టాలు తీర్చితే.. ఆయనపై కోపంతో రేవంత్ సర్కారు రైతుల నోట్లో మట్టికొడుతున్నదని విమర్శించారు. కాళేశ్వరం మోటర్లను ఆన్‌చేసి ఎత్తిపోతలు ప్రారంభిస్తే రైతులు కేసీఆర్‌ను గుర్తుచేసుకుంటారనే అక్కసుతోనే కాళేశ్వరం నీటిని సముద్రంపాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జూలై, ఆగస్టు నెలల్లో రోజుకు 10 లక్షల క్యూసెక్కుల నీరు వృథాగా పోయినా ప్రభుత్వం పట్టించుకోలేదని దుయ్యబట్టారు. ప్రస్తుతం మేడిగడ్డ వద్ద లక్షా 75 వేల క్యూసెక్కుల నీరు వృథాగా పోతున్నదని, అయినా సర్కారుకు సోయిలేదని ఫైర్ అయ్యారు. మేడిగడ్డ బరాజ్ గేట్లు మూయకున్నా కన్నెపల్లి పంప్‌హౌజ్ ద్వారా నీళ్లు ఎత్తిపోయవచ్చని నీటిపారుదలశాఖ అధికారులే చెప్తున్నారని వెల్లడించారు. వర్షాలు లేక ఎల్‌ఎండీ రిజర్వాయర్ ఇప్పటికీ నిండలేదని, ఎల్లంపల్లి ద్వారా నీటిని ఎత్తిపోసి మిడ్‌మానేరు, ఎల్‌ఎండీ జలశాయాలను నింపాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్, బీఆర్‌ఎస్ కరీంనగర్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

# రైతుకు అప్పు లేదని సర్కారు అబద్ధం!

- రుణమాఫీ చేయకుండా బుకాయింపు
- జీరో బకాయి ఉన్నట్టు వ్యవసాయాధికారుల పత్రం
- బ్యాంక్‌కు వెళ్లి చూస్తే రూ.1,63,258 రుణం
- ఏం చెయ్యాలో తెలియక మదన పడుతున్న రైతు



27-8-2024 తేదీ నాటికి రూ.1,63,258 అప్పు ఉన్నట్లు కొత్తగూడెం కేవీబీ ఇచ్చిన స్టేట్‌మెంట్

టేకులపల్లి, ఆగస్టు 30: కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన 'రైతు రుణమాఫీ'లో ఎన్నో చిత్రవిచిత్ర గాథలు చోటుచేసుకుంటున్నాయి. తాజాగా మరో విచిత్రం వెలుగులోకి వచ్చింది. బ్యాంక్‌లో అసలు అప్పునే లేదంటూ ఓ రైతుకు రుణమాఫీ చేయకుండా ప్రభుత్వం తప్పించుకుంది. పూర్తి వివరాల్లోకెళ్తే.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం కోయగూడెం గ్రామానికి చెందిన సూరేపల్లి వెంకట్రావు జిల్లాకేంద్రం కొత్తగూడెంలోని కరూర్ వైశ్యా బ్యాంక్‌లో ఖాతా నెంబర్ 4810272000000047 పేరుతో 2021 ఫిబ్రవరిలో వ్యవసాయ రుణం తీసుకున్నాడు. అయితే ప్రభుత్వ నిబంధనల ప్రకారం రుణమాఫీకి తాను అర్హుడైనప్పటికీ మాఫీ కాలేదు. దీంతో వ్యవసాయ అధికారులను సంప్రదించగా వారు 'రైతు సమాచార పత్రం' చేతిలో పెట్టారు. అది చూసిన రైతు నివ్వెరపోయాడు. 9-12-2023 తేదీ నాటికి తనకు బ్యాంకులో ఉన్న బకాయి జీరో లేదా నెగెటివ్‌లో ఉన్నట్లు దానిలో ఉంది. ఇదేమిటని అధికారులను అడిగితే బ్యాంక్‌లో సంప్రదించాలని ఉచిత సలహా ఇచ్చారు. చేసేదిలేక ఆ రైతు కరూర్ వైశ్యా బ్యాంక్‌కు వెళ్లి స్టేట్‌మెంట్ తీయించగా దానిలో 27-8-2024 తేదీ నాటికి రూ.1,63,258 అప్పు ఉన్నట్లు ఉంది. ఇదెక్కడి విచిత్రమో అర్థంకాక ఆ రైతు తల పట్టుకుంటున్నాడు. తన సమస్యను ఎవరు పరిష్కరిస్తారో తెలియక మదనపడుతున్నాడు.

### రుణం మైనస్‌లో ఉందని మాఫీ కాలే..



నాకు కొత్తగూడెం కరూర్ వైశ్యా బ్యాంక్‌లో రూ.లక్షన్నర పైన అప్పు ఉంది. మాఫీ కాలేదు. వ్యవసాయ అధికారులను అడిగితే 9-12-2023 నాటికి బ్యాంక్‌లో బకాయి ఉన్న రుణం సున్నా ఉన్నట్టు చెప్పారు. ఇదేమిటని అడిగితే సరైన సమాధానం లేదు. పెద్దసార్లు స్పందించి నాకు రుణమాఫీ వర్తింపజేయాలి. - ఎస్.వెంకట్రావు, టేకులపల్లి

# యూరియా కోసం రైతుల అగచాట్లు

రాయపర్తి, ఆగస్టు 30: యూరియా కోసం అన్నదాతలు అగచాట్లు పడుతున్నారు. వరంగల్ జిల్లా రాయపర్తి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద 40 గ్రామపంచాయతీల పరిధిలోని రైతన్నలు శుక్రవారం యూరియా బస్తాల కోసం బారులు తీరారు. పీఏసీఎస్‌లో యూరియా బస్తా రూ.275కే ఇస్తుండగా, ప్రైవేట్ దుకాణాల వద్ద రూ.350 వసూలు చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. రోజంతా క్యూలో నిలబడితే ఆధార్ కార్డుకు 5 యూరియా బస్తాలే ఇస్తున్నారని పెదవి విరుస్తున్నారు. ఈ విషయమై మండల వ్యవసాయాధికారి గుమ్మడి వీరభద్రంను వివరణ కోరగా రోజుకు రెండు లారీల్లో80 టన్నుల యూరియా బస్తాలను తెప్పించి పంపిణీ చేయిస్తున్నామని, రైతులంతా ఒక్కసారిగా ఎగబడుతుండడంతో లైన్లు కన్పిస్తున్నాయని చెప్పారు.

# అరేబియాలో 'అస్నా' తుఫాన్

న్యూఢిల్లీ, ఆగస్టు 30: అరేబియా సముద్రంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం కచ్ తీరం, పరిసర పాకిస్థాన్ ప్రాంతాల్లో 'అస్నా' సైక్లోన్‌గా మార్పు చెందిందని భారత వాతావరణ విభాగం(ఐఎండీ) శుక్రవారం వెల్లడించింది. ఇది వాయువ్య దిశగా సాగుతున్నదని, రాబోవు రెండు రోజుల్లో భారత తీరానికి దూరంగా వెళ్లే అవకాశం ఉన్నదని అంచనా వేసింది. కాగా, అరేబియా సముద్రంలో అల్పపీడనం కారణంగా గుజరాత్‌లోని పలు ప్రాంతాల్లో శుక్రవారం భారీ వర్షాలు కురిశాయి. దీంతో కొన్నిచోట్ల వరద పరిస్థితులు నెలకొన్నాయి. 1976 తర్వాత అరేబియా సముద్రంలో ఆగస్టులో తుఫాన్ ఏర్పటడం ఇదే తొలిసారి.

# రుణమాఫీ కోసం పాదయాత్ర

- ఆరు కి.మీ నడిచిన అన్నదాతలు
- ఆందోళనలు చేస్తే కేసులు పెడుతున్నారని ఆదిలాబాద్ జిల్లాలో వినూత్నంగా నిరసన
- కాలినడకన వెళ్లి తహసీల్దార్‌కు వినతిపత్రం

ఆదిలాబాద్, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ) : రుణమాఫీ కోసం అన్నదాతల ఆందోళనలు, నిరసనలు కొనసాగుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 2 లక్షల రుణమాఫీ విషయంలో చేసిన మోసాన్ని ఎండగడుతూ ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేయడంతో ఆదిలాబాద్ జిల్లాలో 15మంది రైతులపై కేసులు నమోదయ్యాయి. దీంతో రైతులు నిరసనకు వినూత్న మార్గాన్ని ఎంచుకున్నారు. ఇదే జిల్లాలోని తాంసి మండలం కప్పర్లకు చెందిన వందమంది రైతులు శుక్రవారం తమ ఊరి నుంచి పాదయాత్ర చేపట్టారు. ఆరు కిలోమీటర్లు కాలినడకన వెళ్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు తమకు రూ.2 లక్షల రుణమాఫీ కాలేదని వాపోయారు. రేషన్‌కార్డుతో సంబంధం లేకుండా పట్టాపాస్‌లు పుస్తకం ఉన్న రైతులందరికీ రుణమాఫీ చేస్తామని చెప్పి ఇప్పుడు నిబంధనల పేరిట ఎగ్గొట్టాలని చూస్తున్నారని మండిపడ్డారు. కప్పర్ల తెలంగాణ గ్రామీణ బ్యాంకు, తాంసి కో ఆపరేటివ్ బ్యాంకుల్లో పంట రుణాలు తీసుకున్న 70 శాతం మందికి రుణమాఫీ కాలేదని చెప్పారు. మూడు విడుతల్లో కలిపి 200 మంది రైతులకు మాఫీ వర్తించలేదని, బ్యాంకులు, అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేదని మండిపడ్డారు. అందుకే శాంతియుతంగా నిరసన తెలిపేందుకు పాదయాత్రగా వచ్చినట్టు చెప్పారు. అనంతరం తమకు రుణమాఫీ వర్తించేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ లక్ష్మి, వ్యవసాయశాఖ అధికారి రవీందర్‌కు వినతిపత్రం అందజేశారు.



ఆదిలాబాద్ జిల్లా తాంసి తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

### రూ. 1.64 లక్షల లోన్ మాఫీకాలే



నాలుగు ఎకరాలపై నేను తాంసి మండలం కప్పర్ల తెలంగాణ గ్రామీణ బ్యాంకులో రూ. 1.64 లక్షల లోన్ తీసుకున్న. ఏటా రెన్యూవల్ చేసుకుంటున్న. నా భార్య పేరిట భూమి ఉన్నా లోన్ తీసుకోలే. నా ఒక్కని పేరుమీదే ఖాతా ఉన్నది. నాకు మూడు విడుతల్లోనూ రుణమాఫీ కాలే. వ్యవసాయ అధికారులను అడిగితే డాటా నాట్ ఫౌండ్ అని వస్తుందంటున్నరు. బ్యాంకు అధికారులను అడిగితే వివరాలు పంపకపోవడం వల్లే రుణమాఫీ కాలేదంటున్నరు. రుణమాఫీకి అర్హుడిగా ఉన్న నా లోన్‌ను రద్దు చేయాలి.

– చిన్న రాములు, కప్పర్ల, తాంసి మండలం, ఆదిలాబాద్

### నేను రైతును కాదా?



నేను కప్పర్ల గ్రామీణ బ్యాంకులో రూ. 1.60 లక్షలు రుణం తీసుకున్న. రేవంత్‌రెడ్డి చెప్పినట్టు నా లోన్ మూడో విడుతలో మాఫీ అవుతదనుకున్న. కానీ లిస్టులో నాపేరు లేదు. సార్లను అడిగితే నీ లోన్ వివరాలు పంపించినం అంటున్నరు. నేను రైతును కాదా ? నాకు రుణమాఫీ ఎందుకు కాలే? పాత సర్కారు చెప్పినకాడికి అందరికీ రుణమాఫీ చేసింది. వీళ్లు మాత్రం కొందరికే ఇచ్చి చాలామందికి మాఫీ చెయ్యలే. మా బాధను అర్థం చేసుకొని రుణమాఫీ చెయ్యాలి.

– గుజ్జటి రాందాస్, కప్పర్ల

### 8 నెలల నుంచి ఎదురుచూస్తే నిరాశే



నాకు కప్పర్ల శివారులో మూడెకరాల భూమి ఉన్నది. బ్యాంకులో రూ.1.70 లక్షల పంటరుణం తీసుకున్న. సీఎం రేవంత్‌రెడ్డి చెప్పినట్టు నాకు లోన్ మాఫీ అవుతదని 8 నెలల నుంచి ఎదురుచూస్తున్న. మూడో విడుత ప్రకటించిన జాబితాలో నా పేరు లేదు. వ్యవసాయ పనులు వదిలి అధికారుల చుట్టూ తిరుగుతున్న. ప్రభుత్వం ముందుగా చెప్పినట్టు షరతుల్లేకుండా 2 లక్షల రుణమాఫీ చెయ్యాలి.

– నీరటి రాకేశ్, కప్పర్ల, తాంసి మండలం, ఆదిలాబాద్

### బ్యాంకు వద్ద పడిగాపులు



జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలోని శివునిపల్లి బ్యాంక్ ఆఫ్ బరోడా తీయకముందే మాఫీపై విచారణ కోసం వేచి ఉన్న రైతులు

### షరతుల్లేని రుణమాఫీ కావాలి



షరతుల్లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలని శుక్రవారం కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండలకేంద్రంలోని కుమ్రంభీం చౌరస్తాలో అఖిలపక్షం, తుడుందెబ్బ ఆధ్వర్యంలో రైతులు రాస్తారోకో నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ సునీల్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ఆత్రం చంద్రశేఖర్, మాజీ ఎంపీటీసీ సారా రమేశ్ గౌడ్, బీజేపీ మండలాధ్యక్షుడు పులి వెంకటేశ్, పీఏసీఎస్ చైర్మన్ చుంచు శ్రీనివాస్, తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి వెడ్మ భగవంతరావు, రైతులు పాల్గొన్నారు. –తిర్యాణి



పెద్దపల్లి జిల్లా ముత్తారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈవోకు దండం పెట్టి వేడుకుంటున్న ఓడేడు గ్రామానికి చెందిన రైతు అల్లాడి రవీందర్‌రావు

# మీకో దండం సారూ..!

- ఆధార్ నంబర్ తప్పు.. ఇద్దరు రైతులకు శాపం
- పెద్దపల్లి జిల్లా ముత్తారం పీఏసీ ఎస్‌లో ఘటన

ముత్తారం, ఆగస్టు 30 : ఆధార్ నెంబర్ తప్పుగా నమోదు చేయడం ఇద్దరు రైతులకు శాపంగా మారింది. పెద్దపల్లి జిల్లా ముత్తారం పీఏసీఎస్‌లో జరిగిన ఈ ఘటనతో ఖంగుతిన్న ఆ రైతులు మీకో దండం సారు.. నాకు రుణమాఫీ చేయండి మహప్రభో అంటూ అధికారులను వేడుకున్నారు. ముత్తారం మండలంలోని ఓడేడుకు చెందిన అల్లాడి రవీందర్‌రావు ముత్తారంలోని ఎస్‌బీఐలో రూ.1.65 లక్షల పైచిలుకు రుణం తీసుకున్నాడు. అదే గ్రామానికి చెందిన మరో అల్లాడి రవీందర్‌రావు ముత్తారం ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రం ద్వారా వ్యవసాయం కోసం రూ.50 వేల పైచిలుకు రుణాన్ని పొందాడు. అధికారులు రూ.50 వేల రుణం తీసుకున్న అల్లాడి రవీందర్‌రావు ఆధార్ నెంబర్‌కు బదులు ఎస్‌బీఐలో రూ.1.65 లక్షల రుణం తీసుకున్న అల్లాడి రవీందర్‌రావు ఆధార్ నెంబర్‌ను తప్పుగా నమోదు చేశారు. దీంతో పీఏసీఎస్‌లో రుణం తీసుకున్న అల్లాడి రవీందర్‌రావు పేరిట రూ.2.15 లక్షల పైచిలుకు రుణం ఉన్నట్టు చూపించడంతో ఆయనకు రుణమాఫీ జరగలేదు. మరోవైపు రూ.50 వేలు తీసుకున్న రవీందర్‌రావు ఆధార్ నమోదు కాక ఆయనకూ రుణమాఫీ కాలేదు. దీంతో రవీందర్‌రావు శుక్రవారం పీఏసీఎస్‌కు వచ్చి సీఈవోను ప్రశ్నించారు. తనకు రుణమాఫీ మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని, లేకుంటే ఆత్మహత్యే శరణ్యమని కన్నీటి పర్యంతమయ్యాడు. దీనిపై పీఏసీఎస్ సీఈవో ప్రసాద్‌ను వివరణ కోరగా తప్పిదం జరిగిన విషయం వాస్తవమేనని ఒప్పుకున్నాడు.

### అక్రమాలతోనే మాఫీ కోల్పోయాం



నిజామాబాద్ జిల్లా వర్ని మండలంలోని హుమ్నాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో జరిగిన అక్రమాల వల్లే రుణమాఫీ కోల్పోయామని శుక్రవారం రుద్రూర్ మండలం బొప్పాపూర్ రైతులు ఆందోళన నిర్వహించారు. ప్రభుత్వానికి రైతుల అసలు బాకీ చూపించకుండా తక్కువ చేసి చూపించడంతో బొప్పాపూర్‌కు చెందిన 50మంది రైతులు రుణమాఫీ కోల్పోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని, లేకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని రైతులు హెచ్చరించారు. – రుద్రూర్

### తహసీల్ ఎదుట రైతుల ధర్నా




షరతుల్లేకుండా రైతులకు 2 లక్షల రుణమాఫీ చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో జనగామ జిల్లా చిల్పూరు తహసీల్ ఎదుట రైతులు ధర్నా చేశారు. అనంతరం జూనియర్ అసిస్టెంట్ మహేశ్వరికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి రమేశ్, సంపత్, రాజు, శ్రీనివాస్, రవి, మల్లయ్య, భీమయ్య, ప్రభాకర్ పాల్గొన్నారు. – చిల్పూరు

### మాకెప్పుడు రుణమాఫీ?



మాకెప్పుడు రుణమాఫీ అంటూ నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి ఎస్‌బీఐ ఎదుట రైతులు శుక్రవారం నిరసన తెలిపారు. రూ.2 లక్షలపైన రుణం ఉన్నవారు మిగిలిన డబ్బులు ఖాతాల్లో జమ చేయటానికి బ్యాంకుకు వెళ్తే.. అలాంటిదేమీలేదని బ్యాంకర్లు మాఫీపై సీఎంనే అడగాలని సమాధానమిస్తున్నారని వాపోయారు. – కల్వకుర్తి

### డ్వాక్రారుణాలకు రుణమాఫీ డబ్బులా?



నా భార్యకు మహబూబాబాద్‌లోని ఇండియన్ బ్యాంకులో డ్వాక్రా గ్రూప్‌పై రూ. 60 వేలు అప్పు ఉంది. ఈ డబ్బులు కడితేనే నా పేరు మీద ఉన్న రుణమాఫీ అవుతుందని బ్యాంకు అధికారులు చెప్తాన్రు. లేకపోతే అందులోనే ఉన్న డబ్బులను డ్వాక్రా అప్పుకు కట్ చేస్తామంటున్నరు. పెట్టుబడి కోసం ఇచ్చిన డబ్బులను అట్లా చేయవద్దని చెప్పిన. ఇండియన్ బ్యాంకు అధికారులు ఒప్పుకోవడం లేదు. డ్వాక్రా రుణాలకు తరలించకుండా రుణమాఫీ అయ్యేలా న్యాయం చేయాలె.

– గుగులోత్ సీతారాం, రైతు, బేతోలు, మహబూబాబాద్